విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

మెనూ అమలులో రాజీ వద్దు

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో ఎటువంటి రాజీపడవద్దని గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి కె.సుధాకర్ రెడ్డి అన్నారు. గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల అభిరుచి మేరకు మెనూలో మార్పులు తెచ్చిందని, విద్యార్థులందరూ ప్రతి రోజు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేయాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిరోజు మెనూలోని ఆహార పదార్థాలను రుచి చూడాలని, అందుబాటులో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా రుచిచూసేలా చూడాలని అన్నారు. పాఠశాలలోని విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, ఉర్దూ డీఐ ఎండీ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 టీం సెలక్షన్స్

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బాల బాలికల టీం సెలక్షన్స్ ఈ నెల 25నుంచి డిసెంబర్ 5వరకు జరుగుతాయని 2004, జనవరి 21 తర్వాత పుట్టిన వారు తమ ఒరిజినల్ ఎస్ఎస్సి మార్క్స్ మెమోరాండం, ఆధార్ కార్డులతో ఆయా ప్రాంతాలలో జరిగే సెలక్షన్స్‌లో ఉదయం 8 గంటలకల్లా హాజరుకావాలని ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేది నుంచి ఖాజీపాలెం డాక్టర్ బీఎస్ రాజు జూనియర్ కళాశాల విలువిద్య పోటీలు, 28న బీఆర్ స్టేడియం గుంటూరులో యోగ, జూడో పోటీలు, అదే రోజు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నెట్‌బాల్ టెన్నిస్ పోటీలు జరుగుతాయని చెప్పారు. 29న బీఆర్ స్టేడియం గుంటూరులో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు, డిసెంబర్ 5వ తేదీ గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో స్విమ్మింగ్ పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ తెలిపారు.

ఇబ్బంది ఉంటే తెలియజేయండి



విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆత్మకూరు జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయించి ఇంకా ఇంటి నిర్మా ణం ప్రారంభించని వారితో నగర పాలక సంస్థ కమిషనర్, హౌసింగ్ డిపార్ట్ మెంట్ అధికారులతో కలసి ఎమ్మెల్యే ఆర్కే సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరులో విలువైన స్థలాన్ని ముఖ్యమంత్రి జగన్ ఇచ్చారని, సుమారు సంవత్సర కాలం కావస్తున్నా ఇంతవరకు ఇంటి నిర్మాణం ప్రారంభించని వారు, బేస్‌మెంట్ లెవెల్ వరకు నిర్మించిన వారు... తమకు ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు గాని అధికా రులకు గాని తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, హౌసింగ్ శాఖ అధికారులు, వైసీపీ నాయకులు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

విశాలాంధ్ర-గుంటూరు : విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా మారి భారతదేశానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.ప్రభాకర రావు అన్నారు. స్థానిక బుచ్చయ్యతోటలో ఉన్న నెహ్రూనగర్ శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో నాసా అంతరిక్ష పరిశోధన కాంటెస్ట్-2022 సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ప్రభాకరరావు విద్యార్థులకు నాసా కిట్లు అందజేశారు. అనంతరం ఆయన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం... ప్రాముఖ్యతను గురించి వివరించారు. అంతరిక్షంలో మానవుడు తన ఉనికిని సుస్థిరం చేసుకోవడానికి జరుగుతున్న పరిశోధనల గురించి కూడా తెలియజేశారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, ప్రిన్సిపల్ కృష్ణవేణి, కో-ఆర్డినేటర్ గోవర్ధన్, డీన్ శివశంకర్, నాసా ఇన్‌చార్జ్ మనీషా తదితరులు పాల్గొన్నారు.

టి20 ఎంపికల నిర్వహణ



విశాలాంధ్ర-తెనాలి : సోమవారం స్థానిక రామలింగేశ్వరపేటలోని యువక్రికెట్ అకాడమీలో అమరావతి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కృష్ణ జిల్లాకి, సంబంధించి 16వ టి20 సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అకాడమి కోచ్ షేక్ మాలిక్ పర్యవేక్షించారు. కృష్ణా జిల్లా నుండి 20 మంది క్రీడాకారులు సెలక్షన్స్‌లో పాల్గొన్నారు. సెలెక్ట్ అయిన వారిని గోవాలో జరగబోయే నేషనల్ 2020 టీమ్‌కి ఆడుతారని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా యువక్రికెట్ అకాడమి డైరెక్టర్, గుంటూరు, కృష్ణ జిల్లాల అమరావతి క్రికెట్ అసోసియేషన్ రూరల్ ఇన్‌చార్జ్ హరిదాస్ గౌరిశంకర్ (న్యాయవాది) విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ క్రీడ స్ఫూర్తితో ఆడి జాతీయ స్థాయిలో రాణిస్తే వారికి మంచి భవిష్యత్ ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెలక్టర్‌గా బక్క శివకృష్ణ, టి.మణికంఠ, సుబ్రహ్మణ్యం మామిడిబత్తుల తదితరులు పాల్గొన్నారు.

చిర్రావూరులో ఎడ్ల పోటీలు

విశాలాంధ్ర-తాడేపల్లి : చిర్రావూరులో ధనేకుల అప్పారావు-అనసూయమ్మ గార్ల మెమోరియల్ ట్రస్ట్ వారు నిర్వహించిన ఎడ్ల పోటీలను సోమవారం ఎమ్మెల్యే ఆర్కే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందని, వ్యవసాయానికి ఉపయోగపడే పశుపోషణ ప్రస్తుత రోజుల్లో చాలా ఖర్చుతో కూడుకొని ఉన్నదని, అనేక సమస్యలు వలన పశుపోషణ భారంగా మారిందని రైతులను ప్రోత్సహించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గంజి చిరంజీవి, బుర్ర ముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-తెనాలి : ఇటీవల స్వర్గస్థులైన జీడీసీసీ విశ్రాంత ఉద్యోగి అమిరినేని సాంబశివరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట శివరామ ప్రసాద్ మిత్రమండలి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక మహాత్మా గాంధీ సేవ శాంతి ఆశ్రమంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో దర్శకుడు కనపర్తి రత్నాకర్, వాసిరెడ్డి బదరి ప్రసాద్, గోగినేని గోపిచంద్, కె.వెంకటేష్, రజిని, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. సాంబశివరావు సేవలను ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి కొనియాడారు.

అర్జీలు హేతుబద్ధంగా పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు: స్పందనలో ప్రజల వినతులను పరిశీలించి సత్వరమే హేతుబద్ధంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, జిల్లా రెవిన్యూ అధికారి చంద్ర శేఖర రావు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 115 మంది అర్జీదారులు వినతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిపూర్ణంగా పరిష్కరించిన తరువాత వాటిని రీ ఓపెన్ అవ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న 88 (రీ ఓపెన్) దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీనివాస రెడ్డి, డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, డిపిఓ కేశవరెడ్డి, సంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, డీటీసీ షేక్ కరీం, డియంఅండ్‌హెచ్ఓ డా.సుమయాఖాన్, డీఈఓ శైలజ పాల్గొన్నారు.

దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి ఆన్‌లైన రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్ ప్రారంభం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 49 దివ్యాంగుల బ్యాక్ లాగ్ ఖాళీల భర్తీకి సోమవారం కలెక్టరే లోని శంకరన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కొరకు వెబ్ సైట్‌ను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో కలసి ల్యాప్ టాప్ బటన్ నొక్కి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దృష్టి లోపం గల వారికి 24, వినికిడి లోపం గల వారికి 14, శారీరక చలన లోపం గల వారికి 7, ఆటిజం, మేధో వైకల్యం, నిర్దిష్ట్యా భ్యాస వైకల్యం, బహుళ వైకల్యం గల వారికి 4 పోస్టులకు నోటిఫికేషన్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు.

అధికారులకు కలెక్టర్ సన్మానం

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 6 మంది మెడికల్ అధికారులకు సోమవారం శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. షేక్ మహమ్మద్ హుస్సేన్, డా.సి.ఇందిరా, డా.కే.తిరుమల దేవి, డా.బి.శివాని, డా. బి.అశ్విన్, డా.ఝాన్సీ బాయ్‌లను కలెక్టర్ శాలువ కప్పి సన్మానించారు.

భవన నిర్మాణ అనుమతుల సులభతరానికి చర్యలు



విశాలాంధ్ర-గుంటూరు: నగరంలో అనధికార లే అవుట్స్ అన్నీ ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ ప్యాట్రన్ చేసి, భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో పట్టణ ప్రణాలిక అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గతంలో నగరపాలక సంస్థ అనుమతి లేకుండా అనేక ప్రాంతాల్లో లే అవుట్స్ వేశారని, అందులో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడానికి వీలు కుదరక పోవడం వలన సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అటువంటి అనుమతి లేని లే అవుట్స్ వారు ఇన్ ప్రిన్సిపల్ లే అవుట్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకోవచ్చని, తద్వారా లే అవుట్ లో భవన నిర్మాణాలకు అనుమతులు వస్తాయని తెలిపారు. వార్డ్ సచివాలయాల వారీగా అనధికార లే అవుట్స్ ని గుర్తించి చర్యలు తీసుకోవాలని టి.పి.ఎస్.లను ఆదేశించారు. నగరంలో అనధికార నిర్మాణాలు సాగుతున్నాయని, వాటిని గుర్తిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సిటి ప్లానర్ మూర్తి, డిప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏ.సి.పి.లు కాలేష, బాబురావు, అశోక్ కుమార్, అజయ్ కుమార్, డి.ఈ.ఈ.లు శివకుమార్, కళ్యాణ రావు, రమేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, టి.పి.ఎస్.లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలో ప్రజలు, వ్యాపారస్తులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని మునిసిపల్ కమీషనర్ ఎం.జస్వంత్‌రావు కోరారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, న్యూఢిల్లీ వారి ఆదేశాల ప్రకారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలుపరచుటకు ఏర్పాటు చేసిన ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా ఈ రోజు పట్టణంలో ఉన్న స్ట్రీట్ వెండర్స్, పూల వ్యాపార సంస్థలపై మునిసిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు, హెల్త్ ఆఫీసర్ డా॥కె.హెచ్.నిర్మల, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, మెప్మా సిటి మిషన్ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత క్యారీ బ్యాగులు స్వాధీనం

విశాలాంధ్ర-మంగళగిరి : నగరపాలక సంస్థ పరిధిలో పర్యావరణానికి హాని కలిగించే నిషేధిత క్యారీ బ్యాగులను విక్రయించొద్దు వినియోగించొద్దు అంటూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. అయినప్పటికీ నగరంలో నిషేధిత క్యారీ బ్యాగులను అనేక చోట్ల విక్రయిస్తూనే ఉండగా ప్రజలు సైతం వినియోగిస్తున్నారు. దీంతో అధికారులు నగరంలో క్యారీ బ్యాగుల వినియోగంపై కన్నెర్ర చేశారు. స్ట్రీట్ వెండర్లు, వర్తక, వాణిజ్య దుకాణాలు తదితర ప్రాంతాల్లో సోమవారం పదమూడున్నర కేజీల నిషేధిత క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్న శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు వారికి రూ.3,500 జరిమానా విధించారు. 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన క్యారీ బ్యాగులను విక్రయించకూడదని తెలిపారు. కమిషనర్ శారదా దేవి సూచనల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. నిషేధిత బ్యాగులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పందులను షెడ్లలో పెంచుకోవాలి : కమిషనర్

విశాలాంధ్ర-పొన్నూరు: పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమీషనర్ ఎన్.రాధ పందుల పెంపకం దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పందులు వీధుల్లో తిరగటం వలన ప్రజలకు ప్రాణాంతకర రోగాలు వస్తాయని పందులను డంపియార్డ్‌లో ఏర్పాటు చేసిన పందుల షెడ్లలో పెంచుకోవాలని సూచించారు. ఇప్పటికే చాలాసార్లు పందుల పెంపకం దారులకు చెప్పటం, నోటీసు ఇవ్వటం జరిగిందని ఇకనుండి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. దశాబ్దాలుగా పొన్నూరు పట్టణంలో పందుల సంచారం జరుగుతూనే ఉంది. అధికారులు మారుతూ ఉన్నారు. కానీ సంపూర్ణ కట్టడి చేసే అధికారి పొన్నూరుకు రాలేదని పట్టణంలోని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

మూడో రోజుకు పారిశుద్ధ్య కార్మికుల దీక్షలు



విశాలాంధ్ర-తాడికొండ: పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని హాజరు పుస్తకాన్ని బయటపెట్టాలని తమను విధులలోకి తీసుకోవాలని కోరుతూ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న దీక్షలు సోమవారానికి మూడవ రోజుకు చేరాయి. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14న గుంటూరు కలెక్టరేట్లో ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో మరో పర్యాయం సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు తాడికొండ మార్కెట్ యార్డ్ హమాలీలు మద్దతుగా నిలిచారు. దీక్షలో ఏఐటియుసి రాజధాని ప్రాంత కార్యదర్శి జీవి రాజు, హమాలీలు కలవ కొలను సాంబయ్య, ఇసుకపల్లి రమేష్ , వర్కర్లు నూతక్కి వీరయ్య, మల్లవరపు శ్రీనివాసరావు, జె వెంకటేశ్వర్లు వర్కర్లు పాల్గొన్నారు.

నేడు 'డాక్టర్ షమా'స్ పీసీఓఎస్ క్లినిక్ ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తాన ఆధ్వర్యంలో గుంటూరు నగరం గుంటూరువారితోట ఏడవ లైనులో ఉన్న హోప్ విన్ హాస్పిటల్స్‌లో మొట్టమొదటిసారిగా 'డాక్టర్ షమాస్ పీసీఓఎస్ క్లినిక్' ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా హోప్ విన్ హాస్పిటల్స్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు 'ఉచిత పీసీఓఎస్ స్క్రీనింగ్ క్యాంప్' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తాన మాట్లాడుతూ ప్రస్తుత జీవన శైలిలో వస్తున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవటంతో అధికామవుతున్న పీసీఓఎస్ సమస్యలను నివారించే దిశగా పీసీఓఎస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలకు ఉచిత రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఉచిత పీసీఓఎస్ స్క్రీనింగ్ పరీక్షలు ఈ ఉచిత క్యాంప్‌లో చూడబడునని డాక్టర్ షమ సుల్తాన చెప్పారు.

'ఈడబ్ల్యూఎస్'పై పునర్విచారణ సాగించాలి: కేసన

విశాలాంధ్ర-గుంటూరు: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో పునర్విచారణ చేసి రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ కోరారు. ఆదిపత్య కులాలకు విద్య, ఉద్యోగ రంగాలలో ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ, ఓబీసీ కుల జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అగ్రవర్ణాలలో పేదలకు రిజర్వేషన్ కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వ్రాసిన రాజ్యాంగంలోని ధర్మసూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. ఆర్థిక వెనుబాటు ప్రతిపాదన రిజర్వేషన్ కల్పించరాదని, సామాజిక వెనుకబాటు ఆధారంగా రిజర్వేషన్ కల్పించాలని ఇచ్చిన తీర్పును గుర్తుచేశారు. నాడు మండ కమీషన్ నివేధికలో భాగమైన ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, సంకల్పించిన నాటి ప్రధాని వీపీ సింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మారణ హోమం సృష్టించి ఓబీసీలకు రిజర్వేషన్ అందకుండా చేసిన నాటి రాజ కీయ పార్టీలు నేడు నోరు మెదపకపోవడం శోచ నీయం, రెండు నాలుకల ధోరణిని కొనసాగిస్తున్న నేటి కేంద్ర పాలక పక్ష పార్టీల సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్ణయాన్ని సమర్థిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బదుగు, బలహీన వర్గాల వారి ఆవేదనను సుప్రీంకోర్టు న్యాయ మూర్తికి, ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి విజ్ఞాన పత్రాన్ని పంపించాలని కోరుతూ స్పందనలో కలెక్ట ర్‌కు వినతిపత్రం అందజేశారు. తొలుత గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని జ్యోతి రావు పూలే విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తన్నీరు ఆంజనేయులు, కన్నా మాష్టారు, డాక్టర్ శేషయ్య, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, మల్లె ఈశ్వరరావు, హనుమంతరావు, కోలా అశోక్, పారేపల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలు, ఉద్యోగ కల్పనకై ఉద్యమిద్దాం
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాని



విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని, యువతకు ఉద్యోగ కల్పన చేయాలని విద్యార్థి, యువజనులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న తలపెట్టిన పార్లమెంట్ మార్చ్‌ను జయ ప్రదం చేయాలని కోరుతూ గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం షేక్ వలి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివా రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానం వల్ల లక్షల సంఖ్యలో గ్రామీణ విద్యార్థులకు విద్యా దూరం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. చరిత్రను వక్రీకరించే విధంగా గాడ్సే గొప్ప దేశ భక్తుడిగా పుస్తకాలలో ముద్రించడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాని మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ అమల్లోకి తీసుకువచ్చి దేశంలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాను ప్రకటించకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు గని రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, నగర అధ్యక్ష, కార్యదర్శులు శశి, జ్ఞానదీప్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, వలి, నగర అధ్యక్షులు చిన్నపోతుల శ్రీను, ఎస్ఎఫ్ నాయకులు సాయి, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జూటు రైతులకు తుఫాన్ దెబ్బ

విశాలాంధ్ర-తాడికొండ: వాయుగుండం ప్రభావంతో జూటు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 250 ఎకరాలలో జూటు పంటను సాగు చేశారు. కొద్ది రోజులుగా పంటను కోసి కల్లాలు చేస్తు న్నారు. చాలా చోట్ల పొలాలపై పంట ఉంది. సోమవారం వర్షం పడటంతో వేకువజామున కల్లానికి బయలుదేరిన కూలీలు వర్షం రాకతో ఇంటికి తిరుగు ప్రయాణం కట్టారు. కొందరైతే పంటను పట్టాల మీద ఉంచారు. చేతికొచ్చిన పంట వర్షం వల్ల దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల అదుపులో లారీ డ్రైవర్

విశాలాంధ్ర-తాడికొండ: రహదారి ప్రమాదంలో ఇరువురి యువకుల మృతికి కారణమైన లారీ డ్రైవర్ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 16న పొన్నెకల్లు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు రాత్రి వేళల్లో బైకుపై అడ్డ రోడ్డు వెళుతున్నారు. గ్రామ శివారులో బైక్ ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో పొన్నెకల్లుకు చెందిన ఇరువురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. యువకుల కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీదేవిని గ్రామస్తులు ముట్టడించారు. లారీ డ్రైవర్ను అదుపులోకి తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరితగతన వాహనాన్ని గుర్తించాలని ఎస్సై వినరసింహను ఆదేశించారు. అడ్డరోడ్డు లామ్ హొసన్నా మందిర్ సమీపంలో ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. తాటిరెడ్డిపాలెంలోని ఓ కంపెనీ నుండి దర్వాజాలు, కిటికీలు తీసుకు వెళుతున్న లారీ ప్రమాదానికి కారణమని గుర్తించారు. మేడికొండూరుకు చెందిన లారీగా నిర్ధారణకు వచ్చారు. లారీ డ్రైవర్ నేలపాటి నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

బర్నబాస్ కుటుంబానికి సరకుల అందజేత

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణానికి చెందిన బియ్యం వ్యాపారి దళిత యువకుడు గత నెల హత్య అయిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో గత ఆదివారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుపూడి విక్టర్ ప్రసాద్ అధికారులతో బర్నబాస్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన ఆదేశాల మేరకు పీఓఏ చట్టం ప్రకారం మూడు నెలలకు నిత్యావసరాలను బర్నబాస్ కుటుంబ సభ్యులకు సోమవారం అందించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణనదిలోకి చేప పిల్లల విడుదల

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ఉండవల్లి పడవల రేవు వద్ద ఎమ్మెల్యే ఆర్కే, కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డి కృష్ణా నదిలోకి మత్యశాఖ అధికారులతో కలిసి రూ.10 లక్షల చేప పిల్లలను కృష్ణా నదిలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వచ్చే సంవత్సరం మత్య దినోత్సవం నాటికి మత్స్యకారు లకు ఒక కమ్యూనిటీ హాలును నిర్మించి ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళేటప్పుడు ఏప్రిల్ నుంచి జూన్ నెల వరకు చేపలు గుడ్లు పెట్టే సమయంలో వేటకు వెళ్లకుండా ఉన్నప్పుడు ప్రభుత్వం ఆ మత్యకార కుటుంబానికి నెలకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని, అలాగే నదీ పరివాహక ప్రాంతాలలో మత్స్యకారులకు కూడా ఈ పథకం వర్తించే విధంగా సీఎం జగన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తానని అన్నారు. అలాగే తాడేపల్లిలో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయటానికి ఫిష్ మార్కెట్‌ను నిర్మింపచేస్తామని అన్నారు. మత్స్యకారులకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ రామ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పాస్ పుస్తకాలతో రూ.9 లక్షల రుణం
ఫిర్యాదు చేసిన బాధితురాలు

విశాలాంధ్ర-తాడికొండ : నకిలీ పాస్ పుస్తకాలు దస్తావేజులు సృష్టించి బ్యాంకులో రూ.9 లక్షలు రుణం తీసుకున్న వైనం. తాడికొండ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం పొన్నెకల్లు గ్రామానికి చెందిన దామినేని ఇందిరా దేవికి డి.నెంబర్ 467/1లో 6.2 సెంట్లు, అలాగే డి.నెంబర్ 468లో 1.8 సెంట్లు మొత్తం 7.10 సెంట్లు భూమి ఉంది. ఆమె కొంతకాలంగా గుంటూరు నగరంలోని ఎస్వీఎన్ కాలనీలో నివాసం ఉంటుంది. ఆమె కుమారుడు అమెరికాలో ఉండటంతో కుమారుడిని చూసేందుకు 2020 ఫిబ్రవరి 17న అమెరికా వెళ్ళింది తిరిగి 2021 ఫిబ్రవరి 27న ఇండియాకు వచ్చింది. అయితే గ్రామానికి చెందిన కొందరు ప్రబుద్ధులు ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి దొంగ పాస్ పుస్తకాలు పత్రాలను సృష్టించి 2020 ఫిబ్రవరి 26న నిడుముక్కల కార్పొరేషన్ బ్యాంకులో రూ.9 లక్షలు రుణం తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ఆమె బ్యాంకులోకి వెళ్లి అధికారులను వాకబు చేశారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో సోమవారం ఆమె స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

నిరుద్యోగులను వంచనకు గురిచేసిన పాపం వైసీపీదే: సాయికృష్ణ



విశాలాంధ్ర-గుంటూరు: నిరుద్యోగలోకాన్ని నయ వంచనకు గురిచేసిన పాపం వైసీపీదేనని జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ యువతకు స్వయం ఉపాధికి కార్పోరేషన్ల ద్వారా రుణాలివ్వాలని, బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలనలి, జిల్లాల వారీగా పారిశ్రామిక క్యారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయంవద్ద నిరసన చేపట్టి అనంతరం కలెక్టర్ వేణు గోపాల్ రెడ్డిని స్పందన కార్యక్రమంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ మాట్లాడుతూ గత మూడున్నరేళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేవు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి రుణాలు లేవని జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ కార్పొరేషనలను నిర్వీర్యం చేయడమే గాక కనీసం ఆయా కార్పొరేషన్ల చైర్మన్లకు డైరెక్టర్లకు జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో 15లక్షల కోట్లకు ఎంఓయూలు కుదుర్చుకొని 34 లక్షల మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ప్రణాళికలు రూపొందించటమే కాక 5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిందని కానీ ఈ ప్రభుత్వం ఉన్న కంపెనీలను పారద్రోలి ఎందరోమందిని నిరాశ్రయులను చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిది కెఎమ్‌ఈ హుస్సేన్, షేక్ చిన్న బాజీ, ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి పంచుమర్తి శేషు, జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, జిల్లా అంగన్వాడీ ద్వాక్రా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి లామ్ నవమి,శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ఐఈటీ, ట్రిపుల్ అంతర్జాతీయ వర్చువల్ సదస్సు

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులు తమ విజ్ఞానాన్ని అధ్యాపకులతో పంచుకోవాలని కేఎల్ విశ్వవిద్యాలయం గౌరవాధ్యక్షులు కోనేరు సత్యనారాయణ అన్నారు. సోమవారం కేఎల్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగిన అంతర్జాతీయ వర్చువల్ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన సభనుద్దేశించి ప్రసంగించారు. గేటెక్, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్, సూక్ష్మ తరంగాలు, యాంటెన్నాల అధ్యాయనం, ఐ ట్రిపుల్ ఈ హైదరాబాద్ విభాగంలోని డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ సందీప్ కుమార్ చతుర్వేది ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ సదస్సు చైర్మన్, విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ ప్రారంభోపన్యాసం చేశారు. అధ్యాపకులు, పరిశోధన బృంద అధిపతి డాక్టర్ కె.ఎస్.రమేష్ అతిథులకు స్వాగతం పలుకగా, డాక్టర్ ఎం.సుజాత సదస్సు కన్వీనర్‌గా డాక్టర్ అర్జున ముదులి కో-కన్వీనర్‌గా వ్యవహరించారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ మాట్లాడుతూ మలేషియా, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, సింగపూర్ వంటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు సులభతరమైన పద్ధతిలో పరిశోధన కథనాలను ఈ సదస్సులో సమర్పించారని తెలిపారు. ప్రో-వైస్ చాన్సలర్ వెంకటరాం మాట్లాడుతూ అత్యాధునిక సూక్ష్మ తరంగాలపై ఐఈటీఈ, ఐ ట్రిపుల్‌ఈతో కలిసి నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కమ్యూనికేషన్ సొసైటీ, ఎంటీటీఎస్ విద్యార్థులకు కమ్యూనికేషన్ వ్యవస్థ గురించి పరిశోధన గ్రూపు (సీఎస్ఆర్‌జీ) పలు సూచనలు చేశారని తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రారు ఎ.జగదీష్ మాట్లాడుతూ వైర్‌లెస్ 5జీ, 6జీ ఎంఎంఐ డేటా కమ్యూనికేషన్‌లు, ఆర్ఎఫ్ మిల్లీమెట్రిక్ తరంగాలు, యాంటెన్నా, సిగ్నల్ ప్రక్రియలు, ఐఓటీ, రోబోటిక్ కమ్యూనికేషన్‌ల వంటి ఇటీవలి పరిశోధన డొమైన్‌ల విస్తృత పరిధులను ఈ సదస్సులో నిపుణులు వివరించినట్లు పేర్కొన్నారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ) నుంచి డాక్టర్ దేబ్‌దీప్ సర్కార్, రూర్కీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటి) నుంచి డాక్టర్ ప్యారీ మోహన్ ప్రధాన్, మస్కట్ విశ్వవిద్యాలయం తరుపున టెలికమ్యూనికేషన్ ఇంజ నీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ గుణశేఖరన్ తంగవేల్, దూరదర్శన్ కేంద్రం విజయవాడ నుంచి మాజీ కార్యదర్శి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పామ్మికాళీ ప్రసాద్ కీలకోపన్యాసం చేశారు.

CHANGE OF NAME

I, **KAMBHAMPATI NEERAJA RANI** (Old Name), W/o. Kambampati Venkateswarlu R/o. D.No.134-1-190, Dwaraka Nagar 6th Line, Nagaralu, Guntur - 522007, Guntur District, A.P. Have changed my name to **KAMBAMPATI NEERAJA RANI**. Hereafter my name is known as **KAMBAMPATI NEERAJA RANI**.

CHANGE OF NAME

I, **KAMBHAMPATI VENKATESWARLU** (Old Name), S/o. Kambampati Punnaiah (Late) R/o. D.No.134-1-190, Dwaraka Nagar 6th Line, Nagaralu, Guntur - 522007, Guntur District, A.P. Have changed my name to **KAMBAMPATI VENKATESWARLU.** Hereafter my name is known as **KAMBAMPATI VENKATESWARLU**.

లింక్ దస్తావేజులు పోయినవి

ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామం గుంటూరు జిల్లాకు చెందిన **షేక్.ఫజులుల్లా** ఆధార్ నెం: 267424155553. డోర్ నెం: 2-31 **తండ్రి అహమ్మద్‌కు** సంబంధించిన లింక్ దస్తావేజులు గత నెల **20-10-2022** తేదిన ఫిరంగి పురంలో పోయినవి. డాక్యుమెంట్: 1-**షేక్.మస్తాన్‌వలి తండ్రి మహమ్మద్ షరీఫ్ 5025/1986**. డాక్యుమెంట్-2 **పోలంకి ప్రకాశమ్మ తండ్రి పోలంకి థామస్ 1144/1997**. ఆచూకి తెలిసినవారు షేక్. ఫజులుల్లా మునగపాడు అడ్రస్‌కు తెలియజేయాలని మనవి. సంప్రదించ వలసిన మా అడ్రస్ సెల్ నెం :9989592316, 7673930515.

సండ్రపాటి సైదాకు ముప్పాళ్ల పరామర్శ

విశాలాంధ్ర-వినుకొండ : హైదరాబాదులో చికిత్స పొంది ఇంటి వద్ద కోలుకుంటున్న వినుకొండ పట్టణ మాజీ వైస్ చైర్మన్ కామ్రేడ్ సండ్రపాటి సైదాను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ల నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్, వినుకొండ నియోజ కవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఉలవల పూడి రాము, బూదాల చిన్న, సైదా కుమారుడు అమీర్, బంధువులు పాల్గొన్నారు.

దీక్షా స్వాములకు సద్ది

విశాలాంధ్ర-వినుకొండ : మార్కాపురం రోడ్డులోని శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో, బోసుబొమ్మ సెంటర్‌లోని శివాలయం దేవస్థానంలో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు మనవడు బొల్లా మోహన్ మురళీ కృష్ణ జన్మదినం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్షా స్వాములకు సద్ది ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు, యువ నాయకులు బొల్లా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల చేయూతకు ప్రత్యేక చట్టం

విశాలాంధ్ర-నరసరావుపేట : కౌలు రైతులకు చేయూత నివ్వాలనే సంకల్పంతో పల్నాడు జిల్లాలో ఏపీ పంట సాగుదారు హక్కుల చట్టం-2019(సీసీఆర్సీ)ని అమలు చేస్తున్నామని వ్యవసాయ శాఖ జేడీ మురళి అన్నారు. ఈ చట్టం అమలుతో భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్నామని, ఈ కార్డు ద్వారా కౌలు రైతుకు బ్యాంకుల్లో పంట రుణాలు, పంటల బీమా, సబ్సిడీ పథకాలు, పంట కొనుగోలు అర్హతలు లభిస్తాయని, కార్డు కాల పరిమితి 11 నెలల వరకు ఉంటుందని అన్నారు. పల్నాడు జిల్లాలో 33,172 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించామని జేడీ అన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 40,355 మంది రైతులకు రెవెన్యూ శాఖ ద్వారా గుర్తింపు కార్డులు అందజేశామన్నారు. వీరిలో 3,425 మంది రైతులు బ్యాంకుల నుంచి రూ.13.61 కోట్ల మేర పంట రుణాలు పొందారన్నారు. జిల్లాలో 27,445 మంది భూ యజమానులు ఇప్పటికే బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడం వల్ల కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై రుణాలు ఇవ్వటానికి బ్యాంకర్లకు ఇబ్బందులు కలిగాయన్నారు. జిల్లాలో సీసీఆర్సీ కార్డు కలిగిన రైతులను ఐదుగురిని ఒక జాయింట్ లైబిలిటీ సభ్యులు గ్రూపుగా ఎంపిక చేసి వారికి వ్యవసాయ శాఖ ద్వారా బ్యాంకు నుంచి రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

సత్రశాలను దర్శించిన పీఠాధిపతి

విశాలాంధ్ర-రెంటచింతల: కార్తిక మాసం ఆఖరు సోమవారం కావటంతో పురాతన పుణ్యక్షేత్రం సత్రశాల భక్తులతో కిటకిటలాడింది. కడప జిల్లా బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి వెంకట్రాది స్వామి సత్రశాల మల్లయ్య-భ్రమరాంబ దేవతామూర్తులను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాధికారులు ఘనంగా సన్మానించారు. హెూమం, సామూహిక పూజలు చేపట్టారు. రెంటచింతల శివాలయం, సత్రశాలలో వేలాది మంది భక్తులకు, దీక్షాపరులకు అన్నదానం జరిగింది. విశ్రాంత ఎస్సీ చాంధీనాయక్, రెంటచింతల సర్పంచి పూజల పుష్పావతి రామయ్య దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు కావాల్సిన సౌకర్యాలను దుర్గి మార్కెట్ యార్డు డైరక్టరు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, సత్రశాల మాజీ చైర్మన్ వేముల పిచ్చయ్య అందజేశారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం

విశాలాంధ్ర-వినుకొండ : సకల జనుల కార్తిక వన సమారాధన కార్యక్రమంలో భాగంగా కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కొండపై వేంచేసి ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవి శంకర్ రెడ్డిలతో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలి పూజ విఘ్నేశ్వరునితో ప్రారంభించి మహా రుద్రాభిషేకం, మహా చండి, మహా రుద్రయాగం, శివపార్వతుల కళ్యాణం, కోటి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం కొండపైన వన భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు కొండపైకి చేరుకునేందుకు ఆర్టీసీ ద్వారా 15 సర్వీసులను అందుబాటులో ఉంచారు. భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొండపైనున్న శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని మహిళలు దీపాలు వెలిగించుకున్నారు. కొండపైకి ఉదయం 5 గంటల నుంచి బస్సులు ప్రారంభించామని డిపో మేనేజర్ కోటేశ్వరరావు నాయక్ తెలిపారు. సకల జనులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. సీఐలు అశోక్ బాబు, రమేష్ బాబు, ఎస్ఐలు తమ సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా దంపతులు

కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

పీవీఆర్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-మాచర్ల: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నెలకొన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం ప్రారంభం నాటినుండి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యం అన్నదానం చేయడం సంతోషకరమన్నారు. ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సుమారు నెలరోజుల నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహించేలా కమిటీ సభ్యుల కృషి అభినందనీయం అన్నారు. అనంతరం పిన్నెల్లి వెంకటరామిరెడ్డిని అన్నదాన కమిటీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గట్ల కోటిరెడ్డి, చుండూరి మల్లికార్జునరావు, కె అంజిరెడ్డి ఓబుల శెట్టి వెంకటేశ్వర్లు, బొద్దు చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనేటి శ్రీనివాసరావు అంత్యక్రియలు

విశాలాంధ్ర-రొంపిచర్ల : మండలంలో మునమాక గ్రామంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కోనేటి శ్రీనివాసరావుకు సోమవారం గ్రామంలో కన్నీటి వదనాలతో అంత్యక్రియలు జరిగాయి. గ్రామంలో గల తన స్వగృహం వద్ద ఉన్న శ్రీనివాసరావు పార్థివదేహంపై నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండలంలో టీడీపీ అభివృద్ధికి, విస్తరణకు శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాసరావు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తుతెచ్చుకొంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. అనంతరం గ్రామంలో జరిగిన అంతిమయాత్రలో పాల్గొన్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు ట్రాక్టర్‌ను శ్మశానం వరకు నడిపి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు పులిమి రామిరెడ్డి, కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వెన్నా బాల కోటిరెడ్డి, టీడీపీ మండల నాయకులు మెట్టు వెంకటేశ్వరరెడ్డి, చిరుమామిళ్ళ బ్రహ్మయ్య, అడుసుమల్లి భిక్షపతి, కుంపటి రవి, పచ్చవ కృష్ణ, కుమ్మెత కోటిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని వేల్పూరు, ఘంటావారిపాలెం, పొట్లూరు, శావల్యాపురం, కారుమంచి, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక మాస సోమవారం పూజలు, అభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో శివునికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక కనకదుర్గమ్మ దేవాలయంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం విజయపురిసౌత్‌లోని దేశవరపు క్యాంపు తండాలో శ్రీ సేవాలాల్ మహరాజ్, మహలక్ష్మమ్మ ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.25 లక్షల వ్యయంతో చేపడుతున్న ఆలయాల నిర్మాణం 5 నెలల్లో పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ కుళాయి కలెక్షన్ ఇచ్చేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అటవీ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు త్వరలోనే పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని స్థానికులు రిక్రియేషన్ క్లబ్‌ను ఏపీఆర్ డిగ్రీ కళాశాల నుంచి స్వాధీనం చేసుకొని గ్రామ అవసరాలకు కేటాయించాలని ఎమ్మెల్యే పీఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రిక్రియేషన్ క్లబ్ గ్రామస్తులకు చెందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మాచర్ల జడ్పీటీసీ మల్లు స్వామి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కామనబోయిన కోటయ్య, వైసీపీ నాయకులు బూడిద శ్రీను, తంగిరాల రామిరెడ్డి, సంతవరపు లక్ష్మీనారాయణ, హతిరామ్ నాయక్, మునలయ్య, అప్పల స్వామి, మస్తాన్, బూడిద సైదులు, రాందాసు, లాకా వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఎనికపాడు గ్రామంలో నాడు-నేడు నిధులు రూ.24 లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం అమరావతి మండలంలోని వైకుంఠపురం గ్రామంలో నాడు-నేడు నిధులు రూ.24 లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత ప్రాథమిక పాఠశాలలో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అమరావతి మండలంలోని పెద్దమద్దూరు గ్రామంలో పీఏసీఎస్ నిధులు రూ.6.25 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ(మినరల్ వాటర్) ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు... ఒకరి మృతి

విశాలాంధ్ర-రొంపిచర్ల : వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న సంఘటన హైవే రోడ్డు పరిధిలో గల మండలంలో మర్రిచెట్టు పాలెం గ్రామంలో సోమవారం జరిగింది. ఈ సంఘటనలో బైక్ మీద ఉన్న వ్యక్తి మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో విప్పర్ల గ్రామానికి చెందిన తోట చిన్న మస్తానయ్య(36) రొంపిచర్లకు పనుల నిమిత్తం బైక్ మీద వచ్చారు. రొంపిచర్లలో పనులు ముగిసిన అనంతరం తన స్వగ్రామానికి బైక్ మీద వస్తున్నారు. హైవే రోడ్డుపై వెళుతున్న బైక్ మార్గమధ్యలో మర్రిచెట్టు పాలెం గ్రామంలోకి రాగానే వెనుక వైపు నుంచి చెన్నై నుంచి హైదరాబాద్ వైపుకు వేగంగా వెళ్తున్న కారు వర్షము వలన అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్నది. ఈ సంఘటనలో కారు బైక్‌ను కొంతదూరం తీసుకెళ్ళటం వలన బైక్ మీద ఉన్న తోట చిన్న మస్తానయ్య తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరును అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదమునకు కారకులైన కారు డ్రైవర్ ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతుడికి భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు.

పల్నాడు జిల్లా అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టర్ : పల్నాడు జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమానికి పెద్దసంఖ్యలో ప్రజలు వినతులను అందించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులకు అందజేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 110 మంది ధరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 'స్పందన' కార్యక్రమానికి విశేషంగా తరలివచ్చిన ప్రజలకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ తరపున ముప్పాళ్ళ మండలంకు చెందిన ప్రముఖ వ్యాపారి, ఎల్ఐసీ విభాగం చీఫ్ అడ్వైజర్, విశ్వ జననీ ఫౌండేషన్ ప్రతినిధి పొత్తూరి నాగేశ్వరరావు ఉచిత అన్నదానం కార్యక్రమానికి సహకారం అందించారు. దాతలను జేసీ ఘనంగా సత్కరించారు.

ఇదేంకర్మ.. టీడీపీకి బాగా సూటవుతుంది

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: ఇదేం కర్మ అనే కార్యక్రమం పేరు టీడీపీకి బాగా సూట్ అవుతుందని ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచం మారింది, దేశంమారింది, రాష్ట్రం మారింది కానీ ఇదేం కర్మోరాబాబు చంద్రబాబు నాయుడు మారట్లేదని ప్రజలు వాపోతున్నారని కాసు పేర్కొన్నారు. 13యేళ్ల పాలనలో ఏమి చేయకుండా ఇప్పుడు మరో ఛాన్స్ ఇవ్వంటి అంటూ కోరటం విడ్డూరంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు అక్రమాలు, అరాచకాలు చేసి ఆ బురద వైసీపీకి అంటించాలని యరపతినేని చూస్తున్నారని తెలిపారు. గతప్రభుత్వం మరుగుదొడ్లలో కూడా అవినీతికి పాల్పడిందని విమర్శించారు. టీడీపీకి ఏపీలో సొంతంగా పోటీచేసే పరిస్థితి లేక జనసేన, కమ్యునిస్టులు, బీజేపీ, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే కర్మ పట్టిందన్నారు.

హుస్సేన్‌కు వైసీపీ నాయకుల నివాళి

విశాలాంధ్ర-పెదకూరపాడు : స్థానిక వైసీపీ కార్యకర్త(ట్రాక్టర్ డ్రైవర్) షేక్ హుస్సేన్ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆదేశానుసారం పంచాయతీ వార్డు మెంబర్ కరీముల్లా ఆధ్వర్యంలో సోమవారం హుస్సేన్ పార్థివదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి, వైసీపీ నాయకులు, క్రోసూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ భయంకర్ సుభాని, మండల వైస్ ఎంపీపీ షేక్ చాంద్ భాష, షేక్ అందంషఫీ, పెదకూరపాడు అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ దిలావర్ ఉన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట కలెక్టరేట్ : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 67 మంది బాధితులు వివిధ సమస్యలపై జిల్లా ఎస్పీకి వివరించి, వినతిపత్రాలు అందజేశారు. ప్రజా సమస్యలపై సత్వరం చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) బిందు మాధవ్, డీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ దేవాలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-రెంటచింతల: మండలంలో రెంటాలలో సోమవారం క్రీస్తు లూథరన్ దేవాలయ ఏడో వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ప్యారిస్ పాస్టరు సందాల మరియదాసు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వందలాది మందికి అన్నదానం చేసారు. కార్యక్రమంలో ఐజయ్యరాజు, కుక్కమూరి సురేష్ పలువురు పెద్దలు పాల్గొన్నారు.

అర్జీలు గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : స్పందన అర్జీలు ప్రభుత్వం విధించిన గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమ వారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అర్జీదారులను కార్యాలయాల చుట్టూ పదే పదే తిప్పవద్దన్నారు. మండల ప్రత్యేకాధికారులు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు పూర్తి చేయా లన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన నలుగురు వైద్యులకు జిల్లా కలెక్టర్ షీల్డ్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనువాసులు, జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీ శివజ్యోతి, సి.పి.ఓ భరత్ కుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, రవాణా శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లాపంచాయతీ అధికారి రమేష్, పంచాయతీ రాజ్ ఎస్.ఇ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలీమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం జరగాలి: ఎస్పీ



విశాలాంధ్ర - బాపట్ల : స్పందన పిర్యాదుదారుల సమస్యలను చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలపై 30 మంది పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందనలో వచ్చే ఫిర్యాదులపై సకాలంలో ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులును ఆదేశించారు. ప్రజల రక్షణ కోసమే పోలీసు శాఖ పనిచేస్తుందని ఏ సమస్య ఉన్నా నేరుగా దగ్గర్లో ఉన్న పోలీసు శాఖను సంప్రదించాలని తెలిపారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన పిర్యాదులుపై సంబంధిత అధికారులు తీసుకున్న చర్యల నివేదికను ఎప్పటికప్పుడు పోలీసు ప్రదాన కార్యాలయానికి అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ సీఐ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎంపీ

విశాలాంధ్ర - బాపట్ల : మత్స్యకారుల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సోమవారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని డి.ఆర్.సి. సమావేశ మందిరంలో మత్స్య శాఖ ఆద్వర్యంలో జరిగింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద లబ్ధిదారులైన మత్స్యకారులకు రాజ్యసభ సభ్యులు వెంకట రమణ, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌లు రూ.83 లక్షల విలువైన లైవ్ ఫిష్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్-1, ఇన్సులేటెడ్ వెహికల్స్-3, మూడు చక్రాల వాహనం -1 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ మత్స్యసంపదపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారుల బతుకులు ప్రభుత్వం చర్యలతో మారిపోతున్నాయని వారి అభ్యున్నతికి వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. వ్యవసాయ రంగంతో సరిసమానంగా ఆక్వారంగం గుర్తింపు పొందిందన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మత్స్యకారుల జీవితాలు మార్చడానికి ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిట్లను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలని కోరారు. అధికస్థాయిలో రాయితీలు ప్రభుత్వం కల్పించడం సంతోషదాయకమన్నారు. చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ తీర ప్రాంతాలు, మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. చీరాల ఓడరేవు, నిజాంపట్నం ఓడరేవుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తీర ప్రాంతాలు గతంలో అధ్వానంగా ఉండగా ఇప్పుడు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయన్నారు. చీరాల ఓడరేవు వద్ద కొన్ని సమస్యలు ఉండడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ మత్స్యకారుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి పి.సురేష్, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు మామిడయ్య, అనంత నగేష్, సొసైటీ డెరెక్టర్లు చెంచయ్య, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధర్మ రక్షా దినోత్సవం

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని పెసర్లంక, పెదలంక గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్మ రక్షా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెసర్లంక ధర్మరక్షా దార్శనికుడు స్వామి లక్ష్మణానంద సరస్వతి చిత్రపటానికి ముమ్మనేని, గ్రామ సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారక్ జంజనం హేమసుందరరావు, ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ నిడుమోలు బసవయ్య, గుళ్ళపల్లి శివరామకృష్ణ, పూర్ణచంద్రరరావు, కె. రామంస్వామి, పెదపూడి నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దీపోత్సవ ఆరాధనకు ముస్తాబైన శివాలయం

విశాలాంధ్ర - నిజాంపట్నం : స్నానం, దానం, దీపం, ఉపవాసం పర్వదినాల పండుగే కార్తీక మాసం. అలా నెల రోజులు చేయలేని వారు మాస శివరాత్రి పర్వదినం ఒక్క రోజైన సరే నియమ నిష్ఠలతో ఉపవాసం ఉండి శివాలయంలో రుద్రాభిషేకం చేయించి మట్టి ప్రమిదలో 365 ఒత్తులను ఆవు నేతితో దీపం వెలిగిస్తే సమస్త పాపాలు భస్మీపటలమై ఇహలోకంలో సర్వ సౌఖ్యాలు అనుభవించి అంత్యంలో పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని ఇతి వృత్త కార్తీక పురాణ గాథల ప్రతీతి.మాస శివరాత్రి నాడు చేసే ఈశ్వరార్చన, అభిషేకం అపమృత్యుదోషాలను, గ్రహబాధలను తొలగిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాస నమ్మకం.రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, సోదరులు మోపిదేవి వెంకట హరనాథ్ బాబు మాస శివరాత్రి పర్వదినంను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరమయంగా తీర్చి దిద్దుతున్నారు.రేపు జరుగ బోయే అతి పెద్ద పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని సదుపాయాలు ఆలయ కమిటీ పెద్దలచే ఏర్పాట్లు చేయిస్తూ పర్యవేక్షించారు.

కోలాహలంగా గ్యార్మీ పండుగ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండల కేంద్రమైన భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో గ్యార్మీ పండుగను ఆదివారం రాత్రి కోలాహలంగా నిర్వహించారు. స్థానిక జెండా చెట్టు వద్ద జరిగిన గ్యార్మీ వేడుకల్లో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి పాల్గొన్నారు. ప్రార్థనలు, మొక్కులు తీర్చుకున్న అనంతరం ముస్లిం యువత ఆధ్వర్యంలో జెండాలను సుందరంగా అలంకరించి విద్యుత్ దీపాల కాంతుల్లో గ్రామ పురవీధుల్లో నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపులు నిర్వహించారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా గ్యార్మీ పండుగ వేడుకల్లో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

27న ఇస్లాం ధార్మిక సమావేశం



విశాలాంధ్ర - నిజాంపట్నం : ఇస్లాం మత అభివృద్ధి కొరకు ఇస్లాం మతంపై అవగాహన పెంచడానికి ఈ నెల 27 న ఆదివారం రేపల్లె పట్టణంలోని జేఎల్ బి కాలేజ్ రోడ్డులో గల అబూబకర్ మస్జిద్ నందు ఇస్లాం ధార్మిక సమావేశం జరుగుతుందని రాష్ట్ర నూర్ భాషా సంఘ ఉపాధ్యక్షులు షేక్ ఫరీద్ అన్నారు. సోమవారం అయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశం వారైనా, ఏ ప్రాంతం వారైనా, ఏ వంశం వారైనా, ఏ భాష వారైనా, సృష్టికర్త అల్లాహ్ ఒక్కడే అని అంతిమ ప్రవక్త మహమ్మద్ సల్లెల్లాహు అలైహి వ సల్లం ప్రవక్త అనే విశ్వసించిన వారందరూ ముస్లింలే అని ఆయన అన్నారు.27న జరిగే కార్యక్రమానికి ఖాతమేనబూవత్ గుంటూరు మాజిలీసుల్ ఉలమా ఉపన్యాస కార్యక్రమం జరుగును, ప్రచార కార్యక్రమా నిమిత్తం రేపల్లె నుండి రేపల్లె పాత తాలూకా గ్రామాలకు వెళ్లి చెప్పడం జరుగుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమాన్ని ముస్లిం నూర్ భాషా రేపల్లె డివిజన్ కమిటీ ఈ అధ్యాత్మిక సభను సమస్త ముస్లిం సోదరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. షేక్ నాగూర్ వలి జిల్లా నూర్ భాషా సంఘం ఉపాధ్యక్షులు, షేక్ నాసర్ వలి రాష్ట్ర నూర్ భాషా యూత్ కమిటీ సంయుక్త కార్యదర్శి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలోనే ప్రజా సంక్షేమం: కోన

విశాలాంధ్ర - కర్లపాలెం : వైసీపీ పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజా సంక్షేమం మెండుగా అందుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండలంలోని ఏట్రవారిపాలెం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రౌచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీలకు కులాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇంటికే అందుతున్నాయన్నారు. తనకు తెలిపిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతానని తెలిపారు. జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, కర్లపాలెం,బాపట్ల మండల కన్వీనర్‌లు దొంతిబోయిన సీతారామిరెడ్డి, కోకి రాఘవరెడ్డి, ఎంపీటీసీ చీరాల పద్మావతి, మాజీ సర్పంచ్ చీరాల సత్యన్నారాయణరెడ్డి,ఉపాధ్యాక్షులు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, తాండ్ర సాంబశివరావు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : మండలంలోని వెల్లటూరు గ్రామ దేవత శ్రీ కట్లమ్మ తల్లి దేవస్థానంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీకమాసం నాల్గోవ సోమవారంను పురస్కరించుకుని దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, శాసనసభ మాజీ సభ్యులు దేవినేని మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ చౌటూరి లక్ష్మీ, ఎంపిపి డి. లలితకుమారిలు పూజల్లో పాల్గొన్నారు. దేవస్థానం అర్చకులు క్రోవి రామకృష్ణ దంపతులతో వ్రతాలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల భగవనామస్మరణలతో దేవాలయ ప్రాంగణం మారు మ్రోగింది. గ్రామానికి చెందిన దాతలు కొల్లి రమేష్ చౌదరి, మోటూరు చౌదరిలు అందించిన సహాయ సహకారాలతో నిర్వహించిన అన్న సమారాధనలో 8 వేల మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారు. మంత్రి నాగార్జున మాజీ ఎంఎల్ఎ దేవినేని మల్లికార్జునరావులను ప్రజాప్రతినిధులను దేవస్థాన కమిటి సభ్యులు శాలువాలతో సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని పెదపులివర్రు గ్రామంలో స్వయంభుగా కొలువైయున్న శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి ఆలయంలో బ్రహ్మీ ముహూర్తంలో స్వామివారికి చక్కెరతో అభిషేకించారు. బంగారు మయమైన పంచదీపాల కాంతులతో శ్వేతవర్ణ రూపమైన రాజరాజ నరేంద్రుడు చక్కెరతో మిళితమైన దివ్య నిజరపంగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పమాలికలతో అలంకరించారు. స్థానిక రథం సెంటర్‌లో గల శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, గంగా పార్వతి సమేత విఠలేశ్వర స్వామి దేవస్థానం, పలు గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివార్లను పూజించారు.

ప్రజలకు చేరువలో గ్రంథాలయాలు

విశాలాంధ్ర-తెనాలి : గ్రంథాలయాలు సజీవ సంస్థలని, తెనాలి శాఖా గ్రంథాలయం సుదీర్ఘ చరిత్రను సృష్టించిందని తెనాలి గ్రేడ్‌వన్ శాఖా గ్రంథాలయ అధికారిణి కాపూరి రమాదేవి పత్రికల వారితో సోమవారం మాట్లాడారు. 55వ గ్రంథాలయ వారోత్సవాలు తెనాలిలో ఉత్సాహపూరితంగా జరిగాయని వాటిలో పాల్గొన్న ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బాలబంధు సమతారావు, మధురకవి నాళం కృష్ణారావు, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, వెలగా వెంకటప్పయ్య పురస్కారాలను పొద్దుటూరు బాలసాహితీ వేత్త డి.కె.చదువల బాబు, పద్యకవి గోనినేని రత్నాకరరావు, వ్యాఖ్యాన సరస్వతి గుంటూరు ఎ.వి.సుజాత, కథారచయిత గోనుగుంట్ల మురళీకృష్ణలకు ప్రదానం చేయటం పట్ల పలువురు తమహర్షాన్ని వ్యక్తం చేశారని చెప్పారు. బాలలతోపాటు ప్రతి ఒక్కరు తెనాలి గ్రంథాలయంలో అన్నిరంగాలకు సంబంధించిన పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వారంరోజులు గ్రంథాలయ సిబ్బంది, వక్తలు, పోటీలు నిర్వహించిన నిర్వాహకులు ఉత్సాహంగా పాల్గొన్నారని వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. పోటీల నిర్వాహణలో చిత్రలేఖనం నిర్వహించిన ఎస్.జయశేఖరరాజు, క్విజ్ నిర్వహించిన యర్రంశెట్టి హనుమంతరావు, రిసోర్స్ పర్సన్ సిహెచ్ శ్రీదేవి, పుస్తక ప్రదర్శనలకు తోడ్పడిన వజ్రాల రామలింగాచారి, అబ్దుల్ హకీం జానీ, మువ్వా సుబ్బారావు, అయినాల మల్లేశ్వరరావు, ఇ.యల్.వి. అప్పారావు, కె.మోహనరావు, రాళ్ళపల్లి అనిత, యనమల అనిత తదితరులకు అభినందనలు తెలిపారు.

పాలడుగు వెంకట్రామయ్య చిరస్మరణీయులు

విశాలాంధ్ర-తెనాలి : ఉత్తమ ఉపాధ్యాయులు, హేతువాది నమ్మిన సత్యం కోసం నిబద్ధతలో పనిచేసిన వ్యక్తి వెంకట్రామయ్య చిరస్మరణీయులని వక్తలు జోహార్లర్పించారు. తెనాలి గాంధీనగర్, కవిరాజు పార్కులోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో జరిగిన వెంకట్రామయ్య ప్రథమ వర్ధంతి సభలో వక్తలు మాట్లాడారు. సభకు ప్రముఖ వైద్యులు డా॥భీమవరపు సాంబిరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ శాస్త్రీయ ధృక్పధాన్ని విద్యార్థులలో నెలకొల్పి వారి ఉన్నతికి పాటుపడిన వ్యక్తి పాలడుగు అన్నారు. రాష్ట్రంలో అనేక హైస్కూళ్లల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యార్థుల తల్లిదండ్రుల గౌరవాన్ని పొందిన వ్యక్తిగా పేర్కొన్నారు. గతంలో ఆయన వాగ్దానం చేసిన ప్రకారం ఆయన కుటుంబ సభ్యులు ఆయన బాటలోనే పయనిస్తున్నారని చెప్పారు. జనసాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ సమాజంలో విద్యారంగంలో ఉపాధ్యాయుని పాత్ర నాడు నేడు స్థితిని వివరించారు. నేటి ఉపాధ్యాయులు ప్రజాదృష్టితో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. మాతృభాషను నిర్లక్ష్యం చేయకుండా తెలుగు భాషాభివృద్ధికి నేటి తరం కృషిచేయాలన్నారు. వెంకట్రామయ్య వ్యక్తిత్వం, ప్రగతిశీల భావజాలం, నిబద్ధతను నేటి బాలలు అవగాహన చేసుకొని ఆయన బాటలో పయనించాలన్నారు. సభలో చందు నాగేశ్వరరావు, పొట్టి పోలేశ్వరరావు, కె.సత్యనారాయణ, సుధాకర్, శివకృష్ణ, కె.బెన్సర్ వెంకట్రామయ్య గురించి మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో మహన్యాస ఏకరుద్రాభిషేకాలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని 75 తాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో సోమవారం కార్తీక మాసం మాస శివరాత్రి పురస్కరించుకొని భక్తులచే భక్తిశ్రద్ధలతో ఉదయం గణపతి పూజతో ప్రారంభించి పంచామృత అభిషేకాలతో అయోధ్య స్వామి ఉత్సవ విగ్రహానికి సమాధికి వేద పండితులు నుదురుపాటి హనుమంతరావు శర్మ ఆధ్వర్యంలో వివిధ రకాల పూజా కార్యక్రమాలు పంచామృతాభిషేకాలతో పూజలు నిర్వహించారు. అనంతరం శర్మ మాట్లాడుతూ ఏ గ్రామంలో ఏక రుద్రాభిషేకాలతో పంచామృశ అభిషేకాలు నిర్వహిస్తారో ఆ గ్రామంలో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం భక్తులచే కోటి వత్తుల దీప ఉత్సవాలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ నోడల్ అధికారికి వేధింపులు

కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా పంచాయతీ కార్యాలయంలో నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి.రాజ్యలక్ష్మిని అదే కార్యాలయంలో పనిచేస్తున్న రాయుడు, వినోద్‌లు సీసీలు అని చెప్పుకుంటూ పలు విధాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు పిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కార్యాలయంకు పైన ఉన్న గదిలో నాకు విధులు కేటాయించి ఆ గదిని వినోద్ అనే వ్యక్తి రాత్రులు వాడుతూ అక్కడే లోదుస్తులు ఉంచుతున్నారని అటువంటి గదిలో నన్ను ఉండమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్ల వయస్సు ఉన్న నన్ను నా విధుల నిర్వహణలో ఆటకం కల్గిస్తు ఇబ్బందిపెడుతున్నారని తెలిపారు. జిల్లా పంచాయితీ అధికారి సమక్షంలో అన్నీ జరుగుతున్నా ఖండించటం లేదని తెలిపారు. కార్యాలయంలో రిపోర్టులు తీసుకునేందుకు వినోద్‌కు రూ.500 ఇస్తేనే రిపోర్టులు తీసి ఇస్తున్నారని లేకుంటే ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. డీపీవో దృష్టికి తీసుకుని వెళ్లిన ఏం చేయకుండా నన్నే దండిస్తున్నారని నేను ఉద్యోగం ఏలా చేయాలంటూ విలపించారు. కలెక్టర్‌కు పిర్యాదు ఇచ్చేందుకు వెళ్తున్న నన్ను రాయుడు వచ్చి నాపై పిర్యాదు ఇస్తావా నేను లోకల్ నీ ఇష్టం అంటూ బెదిరించాడని తెలిపారు. నాకు రక్షణ కల్పించి విధులకు ఆటంకం కలగకుండా చూడాలని రాజ్యలక్ష్మి కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

విశాలాంధ్ర-మేడికొండూరు : మండల పరిధిలోని పేరేచర్లలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనపై మేడికొండూరు సీఐ ఆల్తాఫ్ హుస్సేన్ తెలిపిన వివరాల మేరకు చీమకుర్తికి చెందిన వేల్పుల వెంకటేశ్వర్లు గుంటూరు మిర్చి యార్డ్‌లో ముఠా పనిచేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో దంపతులు ఇద్దరూ పిల్లలతో సహా తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరుగుపయనమై పేరేచర్లలోని నరసరావుపేట ఫ్లైఓవర్ వద్దకు రాగా ఎదురుగా వస్తున్న లారీ వారికి తగలడంతో వెంకటేశ్వర్లు భార్య లక్ష్మి(35) చిన్న పాప అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటేశ్వర్లు భార్య పిల్లలతో కలిసి గుంటూరు కొత్త కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరు చిన్న కుమార్తెలు కావడంతో అమ్మ, చెల్లి చనిపోవడంతో పెద్దపాప కన్నీరు మున్నీరుగా విలపిస్తూ అమ్మా లేమ్మా అంటూ ఆ పాప ఏడుపు చూపరులను కంటతడి పెట్టించింది. మృతదేహాలను పంచనామా నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు. ఈ ప్రమాదంపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువజనోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా ఏర్పాటు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు: ఈ నెల 26 వ తేదిన గుంటూరు కన్వెన్షన్ హాల్‌లో జరిగే యువజనోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి స్టెప్ సిఇఓ వెంకటనారాయణను ఆదేశించారు. సోమవారం కలకరేట్ లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. యువతి యువకులలో దాగివున్న ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో తమ నైపుణ్యమును ప్రదర్శించుకొనుటకు వీలుగా 15-29 సంవత్సరములు మధ్య వయస్సు గల యువతి, యువకులకు వివిధ సాంస్కృతిక అంశాలలో జిల్లా స్థాయిలో పోటీలను జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నవంబర్ 26 వ తేదిన నిర్వహించబడుచున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, సాంస్కృతిక శాఖామంత్రి ఆర్.కే. రోజా పాల్గొంటున్నందున కార్యక్రమాలు చక్కగా నిర్వహించి విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలని యువజన సంక్షేమ ఖాధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం యువజన సంక్షేమ శాఖ స్టెప్ స్వశక్తి వారు రూపొందించిన కరపత్రాలు, గోడ ప్రతులను కలెక్టర్ వేణుగోపాల రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివ నారాయణ శర్మతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కే. చంద్ర శేఖర రావు, జెడ్పీ సీఈఓ శ్రీనివాస రెడ్డి, డీఆర్డీఏ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్లు హరిహరనాథ్, యుగంధర్ కుమార్, డిపిఓ కేశవరెడ్డి, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూధన రావు, డీటీసీ షేక్ కరీం, డిఇఓ శైలజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యాన్ని నెరవేర్చాలి : కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు: సచివాలయ కార్యదర్శులు సమన్వయంతో టీం వర్క్ ద్వారా ప్రజల స్థానిక సమస్యలను పరిష్కరిస్తూ, ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని నెరవేర్చాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో స్పందన, సచివాలయ కార్యదర్శులతో జూమ్ ద్వారా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కార్యదర్శుల మధ్య సమన్వయం పెరగాలన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుండి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలని, స్పందనకు అందే ప్రతి అర్జీ తప్పనిసరిగా ముందు, తర్వాత ఫోటో, విచారణ రిపోర్ట్ అప్ లోడ్ చేసిన తర్వాతనే క్లోజ్ చేయాలని, లేకుంటే తగు చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా సెలవులు పెట్టకూడదని, నోడల్ అధికారులు మరింత మెరుగ్గా పర్యవేక్షణ చేయాలన్నారు. అనంతరం కమిషనర్ గతవారం స్పందన ఫిర్యాదులు, స్పందన పోర్టల్, ఈ.ఆర్.పి., వాట్స్ అప్, కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబందిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.రోజా, ఎస్.ఈ. భాస్కర్, సిటి ప్లానర్ మూర్తి, సిఎంఓహెచ్ డాక్టర్ విజయ లక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని మునుగోడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ముగింపు సమావేశంలో భాగంగా వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. విద్యార్థులు పుస్తక పఠనంను అలవాటు చేసుకొని జ్ఞాన సముపార్జన చేయాలని గ్రామ సర్పంచ్ బి.విష్ణు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే సామూహిక పుస్తక పఠనం చేయించారు. అంతకు ముందు భారత్ భౌతిక శాస్త్రవేత్త సి.వి.రామన్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, భారతదేశ గ్రంథాలయ శాస్త్రీయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాస రెడ్డి, పేరేంట్స్ కమిటీ చైర్మన్ ఎస్కే సలావుద్దీన్, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు అన్నారు. మండల పరిధిలోని పాడిబండ్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడపగడప తిరిగి సంక్షేమ పథకాలు అమ్ముతున్నాయా... లేదా అని ప్రజలని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, జిల్లా వైఎస్ఆర్సిపి కార్యదర్శి ఈద సాంబిరెడి, జడ్పిటిసి సభ్యులు కంకణాల స్వర్ణకుమారి , శివాజీ, బత్తుల కోటేశ్వరరావు, వైసీపీ ఎంపీపీ చాంద్బాషా తదితరులు పాల్గొన్నారు.

రీఫిలింగ్ స్థావరంపై విజిలెన్స్ దాడి

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి నగరంలోని బుడ్డయ్య వీధిలో కె.వి.ఆర్ స్టవ్ రిపేర్ సెంటర్‌పై సోమవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సిఐ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గృహ అవసరాలకు వినియోగించే వంట గ్యాస్ సిలిండర్లు అక్రమంగా నిలవచేసి ఇతర చిన్న సిలిండర్లోకి రి ఫీలింగ్ చేసినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్యాస్ రీఫిలింగ్ చేస్తున్న విష్ణువర్ధన్ రావు పై కేసు నమోదు చేసి 60 వంట గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పోలీసులకు రివార్డులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కాంతి రాణా అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విధి నిర్వహనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు నగదు రివార్డులను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమైన స్నేహపూర్వకంగా మెదులుతూ, వారి సమస్యలను పరిష్కరించాలని, పోలీసుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది క్రైమ్ పోలీసులకు, రివార్డ్‌లను అందజేశారు. అందులో క్రైమ్ డీసీపీ పీ.వెంకటరత్నం, ఏసీపీ చలసాని శ్రీనివాసరావు, బి.ఆదినారాయణ, సీఐలు పీ.కృష్ణ, యం.రామ్‌కుమార్, ఎస్సైలు కృష్ణారావు, ఎస్.ఫ్రాన్సిస్‌లు ఉన్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీ మేరీ ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీలకు సహకరించిన వారికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-విజయవాడ(స్పోర్ట్స్) : షూటింగ్ బాల్ మహిళల, పురుషుల రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ షూటింగ్ బాల్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్, కార్యదర్శి గోగులమూడి విజయ్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 18, 19 తేదీలలో నున్న వికాస్ కళాశాల ఆవరణలో షూటింగ్ బాల్ సీనియర్ మహిళల, పురుషుల అంతరజిల్లాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణకు, క్రీడాకారులకు వసతి సౌకర్యాలు కల్పించిన వికాస్ కళాశాల యాజమాన్యం చైర్మన్ నర్సీ రెడ్డి , సెక్రటరీ కరెస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు టీ.షర్ట్ లు అందించిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, షూటింగ్ బాల్ అసోసియోషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురాముడు, బహుమతులు అందించిన హనుమంత్ రాజేశ్వరరావు ఉషా రానికి, క్రీడలు విజయవంతం కావటానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు బి భాగ్యరాజ్ ఆర్ అశోక్ కుమార్, సరళ, వెంకట్రావు, వికాస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ గుడే రాజు, వైస్ ప్రిన్సిపాల్ బి ఉదయ్ కుమార్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు వివిధ జిల్లాలా షూటింగ్ బాల్ కార్యదరులకు ఎన్టిఆర్ జిల్లా కోశాధికారి రవి కిశోర్, ఎపి సాఫ్ట్ టెన్నిస్ కార్యదర్శి దారం నవీన్, కోశాధికారి అబ్దుల్ కరీం కి ధన్యవాదాలు తెలిపారు.

అర్హులు పథకాలు కోల్పోకూడదు : ఆర్కే

విశాలాంధ్ర-తాడేపల్లి: అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడు సంక్షేమ పథకాన్ని కోల్పోకూడదని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణా రెడ్డి అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి మున్సిపల్ కార్యాలయంలో యంటీయంసీ కమిషనర్ శారదా దేవి, ఇంజనీరింగ్ అధికారులు ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయిన 12 సచివాలయాల అడ్మిన్లు, ఎమినిటీస్ సిబ్బందితో ఎమ్మెల్యే ఆర్కే ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారం, మరే ఇతర సమస్యలు మీ దృష్టికి వచ్చిన ఆలస్యం చేయకుండా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

సమాజాభివృద్ధిలో టెలివిజన్ పాత్ర అనన్య సామాన్యం

విశాలాంధ్ర-గుంటూరు : బహుముఖంగా జరుగుతున్న సమాజాభివృద్ధిలో టెలివిజన్ పాత్ర అనన్య సామాన్యమని, ఒకప్పుడు ధనిక వర్గానికి స్వంతమనుకున్న టీవీ నేడు అతి సామాన్యుడికి కూడా అందుబాటులోకి రావడం మంచి పరిణామమని విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో 'మేధో వికాసానికి, విషయ పరిజ్ఞానానికి టెలివిజన్' అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌వీ సింగరయ్య మాట్లాడుతూ విశ్వమానవాళి గత సాంప్రదాయాలకు వర్ధమాన పోకడలను, భవిష్యత్ నవ్య నాగరిక జీవన సరళిని స్పష్టతతో కళ్ళకు కట్టినట్లు చూపగల ఆధునిక శాస్త్ర సాంకేతిక దృశ్య శ్రావణ విప్లవ ఫలితమే టెలివిజన్ అనబడే టీవీ ఆవిష్కరణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ ఎస్.సదాశివం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు : జగన్‌మోహన్ రెడ్డి ఓటర్ల లిస్టును తారుమారు చేయాలని ఆలోచన చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, మాజీ శాసనసభ్యులు, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, గుంటూరు తూర్పు ఇంచార్జి నసీర్ అహ్మద్, గుంటూరు పశ్చిమ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర, గుంటూరు నగర పార్టీ అధ్యక్షులు దేగల ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 3, 4 తేదీలలో ఓటర్ల చేర్పులపై దృష్టి సారించాలని కోరారు. జగనన్న కాలనీల పేరుతో బయటివారికి పట్టాలిచ్చి, వారిని ఓటర్లుగా నమోదు చేయాలని చేస్తున్నారని, ఆయా ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు జరిపిన ముఖ్యమంత్రి బారికేడ్లు కట్టుకొని తిరగాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. బాదుడే బాదుడు కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో మద్దిరాల ఇమ్మానుయేల్, దాసరి రాజామాస్టారు, చిట్టాబత్తిన శ్రీనివాసరావు, మానుకొండ శివప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు, వద్రాణం హరిబాబు, దామినేని శ్రీనివాసరావు, కంచర్ల శివరావ ఎయ్య, ముత్తినేని రాజేష్, అడకా శ్రీనివాసరావు, జంపని హనుమంతరావు, పానకాల వెంకటమహాలక్ష్మి, గోళ్ళ ప్రభాకర్, దాముచర్ల శ్రీనివాసరావు, కల్లూరి శ్రీనివాసరావు, జొన్నాదుల మహేష్, కందుకూరి వెంకటేశ్వరరావు, నాయుడు ఓంకార్, రావి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

విశాలాంధ్ర విజయవాడ లీగల్ : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదు, రూ.7 వేలు జరిమానా విధిస్తూ విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఐ.శైలజా దేవి సోమవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం విజయవాడ, కొత్తపేటకు చెందిన యువతికి విజయవాడ, అజిత్ సింగ్‌నగర్‌కి చెందిన చిల్లా వెంకటేష్ రెడ్డికి 2007 లో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కాగా, భర్త తన భార్యను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో 2017 జనవరి 20న వివాహిత తల్లి తన కుమార్తె ఇంటికి చూడడానికి వెళ్ళగా, తన కుమార్తె వంట గదిలో మెడ కోయబడి రక్తపు మడుగులో చనిపోయి ఉంది. ఫిర్యాది తన కుమార్తె మరణానికి అల్లుడే కారణమని అజిత్ సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. ఈ కేసులో ఏ.పి.పి చంద్రగిరి విష్ణు వర్ధన్ 18 మంది సాక్షులను విచారించగా నిందితుడి (33) పై నేరం రుజువు కావడంతో జీవితకాలం కఠిన కారాగార జైలు శిక్ష (జీవిత ఖైదు) , రూ.7 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

స్వామివార్లకు ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అమరావతి : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అమరావతిలో కొలువుతీరి ఉన్న శ్రీ బాల చాముండికా సమేత అమరేశ్వర స్వామి వార్లకు కార్తీక మాసంలోని ఆఖరి సోమవారాన్ని పుష్కరించుకొని వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచి పవిత్ర కృష్ణా నదిలో స్నానాలు ఆచరించి అనంతరం స్వామివార్లను సేవించి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా అమరావతి పోలీసులు పెద్ద సంఖ్యలో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు అసౌకర్యం జరగకుండ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కర్లపాలెం : ఈ నెల 14వ తేదీ నుంచి జరుగుతున్న 55వ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో ఉత్సాహంగా ముగిశాయి. గ్రంథాలయ అధికారి టీవీ రమణమ్మ ఆద్వర్యంలో పుస్తక ప్రదర్శన, ఆటల పోటీలు, ర్యాలీ నిర్వహించి బహుమతులు, సర్టిఫికేట్‌లు సర్పంచ్ నక్కా లలితకుమారి, ప్రధానోపాధ్యాయిని మాధవిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీ మహాలక్ష్మి, ఇందుమతి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఎం శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు ముదునూరి వెంకట కృష్ణంరాజు తదితరులున్నారు.

రేపు బ్రాహ్మణ సేవా సంఘం వన సమరాధన

విశాలాంధ్ర-గురజాల: గురజాల బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘం సంఘం సభ్యులు తెలిపారు. స్థానిక ఇష్టకామేశ్వర స్వామి దేవాలయంలో జరుగు వనసమారాధనలో అభిషేకాలు, పూజ కార్యక్రమం జరుగుతుంది అని, ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా బి.నరహరి హాజరవుతారన్నారు. బ్రాహ్మణ బంధువులు అందరూ హాజరు కావాలని కె. సోమనాథశాస్త్రి, పివి సుబ్రమణ్యం, మద్దాలి రాంబాబు, రెంటాల నాగేశ్వరరావు కోరారు.

నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-గుంటూరు: నగరంలో రోడ్ల విస్తరణ పనులు వేగంగా జర్గుతున్నాయని, పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి అయ్యేలా ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు నేరుగా పర్యవేక్షణ చేస్తున్నారని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎంఎల్ఏ మహ్మద్ ముస్తఫాతో కలిసి ఇటీవల రోడ్ విస్తరణ పనులు పూర్తి చేసిన కొత్తపేట శివాలయం నుండి నెహ్రూ నగర్ రైల్వే గేటు వరకు రూ. 125.50 లక్షలతో 420 మీటర్ల పొడవు సిసి రోడ్, 390 మీటర్ల డ్రైన్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో సుదీర్ఘకాలం నుండి పెండింగ్‌లో ఉండి ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేశామన్నారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ విస్తరణ పనుల వలన రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ వలన ప్రజలకు ఏర్పడే ఇబ్బందులు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, 5వ వార్డ్ కార్పొరేటర్ యాట్ల రవి కుమార్, ఈ.ఈ. కోటేశ్వరరావు, డి.ఈ.ఈ. శ్రీనివాసరెడ్డి, ఏ.ఈ. రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్ పోటీలకు కేఎల్ విద్యార్థులు

విశాలాంధ్ర-తాడేపల్లి: కోనేరు లక్ష్మయ్య డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బీసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వంగ కరుణశ్రీ, సిహెచ్ లోకేష్‌లు, అండర్ ట్వంటీ జిల్లా అథ్ లేట్ మీట్‌లో 6 కిలోమీటర్స్ క్రాస్ కంట్రీ విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారని సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 18,19 తేదీలలో గుంటూరులో జరిగాయని, వీరిద్దరూ వచ్చే నెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారని, అక్కడ కూడా విజయం సాధిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. విధ్యార్థుల అభినంద కారక్రమంలో కంప్యూటర్ సైన్స్ ధరఖాస్తులు విభాగ అధిపతి డాక్టర్ భగవాన్, ఉప అధిపతి డాక్టర్ కిరణ్ బాబు, కోఆర్డినేటర్ వెంకటరమణ, రోహిత్‌లు పాల్గొన్నారు.

రామూర్తికి రాష్ట్ర వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ సంతాపం

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు జి.వి. రామ్మూర్తి సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన మృతికి ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ తరుపున సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది చేనేత కులాల సంఖ్యా బలం ఉంటుందని అంచనా వేసి నేతన్నల సంఘటిత పోరు ద్వారా రాజ్యాధికారం సాదించవచ్చని బొమ్మన రామచంద్రవు, డా. శీరం శ్రీరామ చంద్రమూర్తి, కాలేపు సత్యనారాయణ మూర్తి వంటి చేనేత దిగ్గజాలను కలుపుకొని 1992లో ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ఏర్పాటు చేసి రాష్ట్రంలో చేనేత ప్రభంజనానికి నాంది పలికిన మహనీయులు రామమూర్తి అని కొనియాడారు. రాష్ట్రంలో 26 చేనేత కులాలున్నాయని ఈ కులాల మధ్య ఐక్యత వస్తే బడ్జెట్లో, పరిపాలనలో చేనేత వర్గం వారు తమ వాట సాధించుకొని సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించగలరని నమ్మి వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్ళిన యోదుడని పేర్కొన్నారు. చేనేత కులాల ఐక్యతతో మన హక్కులు సాధించుకోవాలన్న రామమూర్తి పిలుపును నిజం చేసిన నాడే వారికి నిజమైన నివాళులు అర్పించడం జరుగుతుందని చేనేత సమాజం తెలుసుకోవాలన్నారు. రామమూర్తి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆశిస్తూ రెండు రోజులు సంతాప దినాలను ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ ప్రకటిస్తూ ఘనం నివాళులు అర్పిస్తుందని పేర్కొన్నారు.

ఎన్జీఓ సంఘ ఎన్నికలకు నోటిఫికేషన్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఏలూరు జిల్లా చాట్రాయి మండలాల పరిధిలో పనిచేస్తున్న విస్సన్నపేట ఏపీ ఎన్జీవో సంఘం ఎన్నికలకు సంఘం జిల్లా నాయకత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అధ్యక్షుడు పి.రవికుమార్ తెలిపారు. ఈనెల 28వ తేదీ నుంచి సంఘ భవనంలో నామినేషన్ల స్వీకరణ, డిసెంబరు 5వ తేదీన ఎన్నికలు ఉంటాయని ఆయన వివరించారు.

దేవాలయంలో చోరీ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలం కలగర పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో చోరీ జరిగిన ఘటన వెలుగుచూసింది. గ్రామస్తుల కథనం ప్రకారం ఈనెల 19వ తేదీ రాత్రి దేవాలయంలో పూజల అనంతరం తాళాలు వేసి, ఇళ్లకు వెళ్లామన్నారు. 20వ తేదీ ఉదయం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించి, చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారి మెడలోని సుమారు రూ.36వేల విలువైన నగలు చోరీకి గురైనట్లు గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.